క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యురాలు

జన్నారం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి ఉమా శ్రీ పేర్కొన్నారు. మండలంలోని తపాలపూర్ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం తపాలపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆగస్టు 11న జాతీయ నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు ఆమె పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జంగమ్మ, సందీప్, కమలాకర్, ఆశ కార్యకర్త లలిత, ప్రధానోపాధ్యాయులు మురళీధర్, దుంపల తిరుపతి, తుంగూరి గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామానికి చెందిన గర్భిణి ఆలం అనితకు గురువారం ఉదయం పురిటినొప్పులు రావడంతో ఆమె కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది అంబులెన్స్‌లో జైపూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. ఆరెపల్లి ప్రాంతంలోనే సుఖప్రసవం చేయడంతో పండంటి మగ బిడ్డకి జన్మనిచ్చింది.అనంతరం తల్లీబిడ్డలను మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఈఎంటీ రమేశ్, పైలెట్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం



చిన్నతిమ్మాపూర్‌లో కొట్టుకుపోయిన రేకులు

భీమిని: మండలంలోని చిన్నతిమ్మాపూర్‌లో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. గ్రామంలోని కోట శంకర్ ఇంటిపై రేకులు లేచిపోవడంతో పాటు ఇంట్లో సామగ్రి తడిచిపోయింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. విద్యుత్ అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

నెన్నెల: మండలంలోని కోనంపేటలో గురువారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. బలంగా వీచిన గాలులు అపార నష్టం మిగిల్చాయి. గాలిదాటికి ఇండ్ల పై కప్పులు లేచిపోగ, మామిడి చెట్లు విరిగిపడ్డాయి. ఏనుగుల శంకర్, అల్లి గట్టయ్య, కడారి పోశయ్య, సూర అంజయ్యల ఇంళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ



పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

భీమిని: కన్నెపల్లి మండలంలోని మాడవెల్లి, సాలిగాం గ్రామ పంచాయతీల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మంజూరు పత్రాలను అందించి, భూమిపూజ చేశారు. స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు, నాయకులు ఆశన్న, తిరుపతి గౌడ్, దామోదర్, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన

దండేపల్లి: మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో గురువారం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జెండర్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్ విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. చిన్నపిల్లలకు ఏవి మంచి స్పర్శ, ఏవి చెడు స్పర్శతో పాటు శరీర బాగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బుచ్చన్న, ఉపాధ్యాయురాలు శ్యామల పాల్గొన్నారు.

రోడ్డు బురదమయం..!

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా ఉన్న రోడ్డు

వేమనపల్లి: మండల కేంద్రంలోని బొగుడగూడం నుంచి పాత కల్మలపేటకు వెళ్లే నాలుగు కిలోమీటర్ల మట్టిరోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. ఇటీవల వర్షాలు కురవడంతో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. బైక్‌లు, వాహనాలు అడుగుడుదూరం నడవలేని పరిస్థితి.

ప్రతిపాదనలకే పరిమితం...

గత బీఆర్ఎస్ హయాం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ వరకు ప్రతీసారి రైతులు ఈ రోడ్డు నిర్మాణం కోసం నాయకులకు, అధికారులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. కానీ రోడ్డు నిర్మాణం గురించి శ్రద్ధ చూపడం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్‌కు రైతులు విన్నవించారు. కొలతలు చేసి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించారు. నిధుల లేమితో మంజూరుకు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాత కల్మలపేట రోడ్డు నిర్మాణానికి శ్రద్ధ చూపాలని ప్రజలు వేడుకుంటున్నారు.

నడక కూడా కష్టమే..



పాత కల్మలపేట రోడ్డు పూర్తిగా బురదగా మారింది. వర్షాలకు రోడ్డుపై నీరు నిలువడంతో బురదతో దిగబడుతోంది. ఆ రూట్లో పత్తి చేళ్లకు వెళ్లడానికి నరకంగా మారింది.

- పుల్లయ్య, వేమనపల్లి

రోడ్డు నిర్మించాలి



రోడ్డు నిర్మించాలని అధికారులకు, లీడర్లకు మొక్కుతున్నాం. ఏళ్ల సంది ఆ రోడ్డు గుండా రాకపోకలు సాగుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ఆ రూట్లో వెళ్లడం కష్టమే. తరచూ ఎడ్ల బండ్లు దిగబడితే కష్టం మీద బయటకు తీసుకొస్తున్నాం. దీనిపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలి.

- గుండె రామన్న, వేమనపల్లి

ముందస్తు రాఖీ వేడుక



బూర్గుపల్లి పాఠశాలలో రాఖీ కడుతున్న చిన్నారి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎథిక్ అకాడమీ విద్యార్థులు కలిసి తయారు చేసిన విశాల రాఖీని గురువారం మంచిర్యాల పోలీసుస్టేషన్‌కు బహుమతిగా ఇన్‌స్పెక్టర్ మజారుద్దీన్‌కు అందించారు. ఒకరికొకరు రాఖీలు కట్టుకోవడంతో పాటు, పాఠశాల డైరెక్టర్ చరణ్ రెడ్డికి, ఉపాధ్యాయులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు. రాఖీ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు.

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. బూర్గుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలికలు విద్యార్థులకు రాఖీ కట్టారు.

శాంతిఖని స్కూల్‌లో వృక్షా రక్షా బంధన్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి శాంతిఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రక్షా బంధన్‌ను పురస్కరించుకొని విద్యార్థులు, ఉపాధ్యాయులు వృక్షా రక్షా బంధన్ నిర్వహించారు. ఓ వృక్షానికి రాఖీ కట్టి వేడుకలు నిర్వహించారు.

సమాచారం

రేపు బెల్లంపల్లిలో 5కే రన్

బెల్లంపల్లి: బెల్లంపల్లి స్పోర్ట్స్ క్లబ్, టేప్స్ సొల్యూషన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న 5కే, 2కే రన్ నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రన్‌ఫర్ సురక్ష నినాదంతో యువత పెడదారి పట్టకుండా, సమాజానికి మేమున్నామనే సంకేతం ఇవ్వాలనే సదుద్దేశంతో యువకులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పురుషులకు 5కే రన్, మహిళలకు 2కే రన్ ఉంటుందని పేర్కొన్నారు. 5కే రన్ విజేతలకు రూ.10వేలు నగదు బహుమతి అందించనున్నట్లు ప్రకటించారు. స్త్రీ, పురుషులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్పాట్ ప్రవేశాలకు దరఖాస్తులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ బీఏ, బీఎడ్ కోర్సులో ఈ నెల 8న స్పాట్ అడ్మిషన్ల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహాత్మ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టీఏ ద్వారా ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు కళాశాల వెబ్‌సైట్‌లో గూగుల్ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా కాలేజీ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని తెలిపారు. వివరాలకు 97032 67391, 99128 52567 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

స్పాట్ అడ్మిషన్లు

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లను నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఇంకా భర్తీకాని సీట్లకు గురువారం కాలేజీలో ఈ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్‌తో పాటు పలు బ్రాంచ్‌లలో మిగిలి ఉన్న 68సీట్లను స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ద్వారా భర్తీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ రాజేశ్వర్, పలు విభాగాల అధికారులు నరసింహస్వామి, నారాయణమూర్తి, రవీందర్, దామోదర్, సుమన్, శ్యామల పాల్గొన్నారు.

అభివృద్ధి కమిటీ ఏర్పాటు

చెన్నూర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మంజూరైన నిధులతో అభివృద్ధి చేసేందుకు అమ్మ ఆదర్శ కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ నాగచందర్‌రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పేరెంట్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ డైరెక్టర్ కృష్ణా ఆదిత్య సహకారంతో కళాశాల అభివృద్ధికి రూ.21.90 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నిధుల వినియోగం కోసం కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనుల తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌శర్మ, స్టూడెంట్ కౌన్సిలర్ సందీప్‌కుమార్, అనిల్ పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలి



చెన్నూర్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ, నాయకులు

చెన్నూర్/కాసిపేట: ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. ఆదివాసీల ఆధ్వర్యంలో మండలంలోని కొండపూర్ యాపలో, తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహశీల్దార్ భోజన్నతో, కాసిపేట ఎస్సై ఆంజనేయులుతో గురువారం ఆదివాసీ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు. చెన్నూర్ సీఐ కార్యాలయంలో సీఐ దేవేందర్‌రావు, తహసీల్దార్ మల్లికార్జున్ వేరువేరుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఆదివాసీ కులసంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి, ప్రజాసంఘాలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోటపల్లి: ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోటపల్లి మండల కేంద్రంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎస్సై రాజేందర్ పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బండి రమేశ్, జిల్లా నాయకులు మాంతయ్య, దుగ్నె జైలు, ఈగం లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీ..



ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

బెల్లంపల్లిరూరల్: రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు ప్రయాణికులు గాయపడిన ఘటన బెల్లంపల్లిలో చోటుచేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై బి.రామకృష్ణ కథనం ప్రకారం.. గోధావరిఖనికి చెందిన ఆటో నెన్నెల నుంచి బెల్లంపల్లికి ప్రయాణికులతో వస్తున్న క్రమంలో నెన్నెలకు చెందిన ఆటో బెల్లంపల్లి నుంచి నెన్నెలకు ప్రయాణికులతో వెళ్తుంది. రెండు ఆటోలు ఐటీడీఏ ఉద్యానవన తోట సమీపంలోకి చేరుకోగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటోల్లో ప్రయాణిస్తున్న బెల్లంపల్లికి చెందిన రాజేష్, భీమారం మండలం బూరుగుపల్లికి చెందిన కమల, చెన్నూర్ మండలానికి చెందిన సల్లమ్మతో పాటు మరొకరు గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేష్‌కు తీవ్రగాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెడికల్ బోర్డు తిరిగి నిర్వహించాలి



శ్రీరాంపూర్: వినతిపత్రం ఇస్తున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: జూలై 31న నిర్వహించిన సింగరేణి మెడికల్ బోర్డును తిరిగి మరోసారి నిర్వహించాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం అన్ని గనులు డిపార్టుమెంట్లపై కార్మికుల డిమాండ్లపై నల్ల బ్యాడ్జీలు దర్శించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమి టీ నాయకులు భీమ్ రావు, గరిగె స్వామి, కలవేన శ్యామ్, తిరుపతి రాజు, పేరం రమేశ్, ఏనుగు రవీందర్ రెడ్డి, శీలం చిన్నయ్య, భీమ్ రవి, తిరుపతిరెడ్డి, లాగల శ్రీనివాస్, జీవన్ జోయల్,డివిజన్ నాయకులు పెన్నింటి మల్లారెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై ఐఎన్టీయూసీ నిరసన

మందమర్రిరూరల్: సింగరేణి వ్యాప్తంగా కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏరియాలోని గనులపై ఐఎన్టీయూసీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అధికారులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమాల్లో ఆ యూనియన్ సెంట్రల్, బ్రాంచ్ కమిటీ, ఫిట్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కె.సమ్మయ్య, కేంద్ర కమిటీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా శాంతిఖని గని, సింగరేణి ఏరియా ఆసుపత్రి వద్ద గురువారం వేర్వేరుగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం శాంతిఖని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఏరియా ఆసుపత్రి డీవైసీఎంవో డాక్టర్ మధుకు వినతిపత్రాలు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు శంకర్రావ్, ఓదెలు, ఏరియా ఆసుపత్రి కార్యదర్శి ఉమాదేవి, ఏరియా కార్యదర్శి శ్రీనివాస్, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం .నారాయణ, శ్రేణులు, కార్మికులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

నాణ్యమైన పనిముట్లు అందజేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న సురేందర్ రెడ్డి

శ్రీరాంపూర్: కార్మికులకు నాణ్యమైన పనిముట్లు సమకూర్చాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5 గనిని గురువారం ఆయన సందర్శించి కార్మికులతో మాట్లాడారు. లైన్మెన్ కార్మికులకు నాణ్యమైన పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. కోల్‌కట్టర్ కార్మికులకు డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్ల కొరత తీవ్రంగా ఉందన్నారు. కార్మికులపై పనిభారం పెరిగిందని పనికి సరిపడా కార్మికులను కేటాయించాలన్నారు. గని మేనేజర్ సుధీర్ కుమార్‌ను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేశ్, కేంద్ర కమిటీ నాయకులు పొగాకు రమేశ్, అన్వేష్ రెడ్డి, ఫిట్ సెక్రెటరీ రవికుమార్, నాయకులు పాపిరెడ్డి, రమేష్, మల్లేష్, భాస్కర్, ఉత్తేజ్ రెడ్డి పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

10న సింగరేణి గిరిజన ఉద్యోగుల సమావేశం

జైపూర్: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ కమిటీ సమావేశాన్ని ఈ నెల 10న గోదావరిఖనిలో నిర్వహించనున్నట్లు సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పంతులానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సెంట్రల్ కమిటీ ఎన్నిక, అభివృద్ధిపై చర్చించనున్నట్లు తెలిపారు. ఏరియాల వారీగా గిరిజన ఉద్యోగులు సమావేశానికి తరలిరావాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు



అవగాహన కల్పిస్తున్న సీఐ దేవేందర్‌రావు



అవగాహన కల్పిస్తున్న సీఐ బన్సీలాల్

చెన్నూర్: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ దేవేందర్‌రావు అన్నారు. స్థానిక మైనార్టీ ఫంక్షన్ హాల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమానులు, డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు సుబ్బారావు, శ్యాంపటేల్, ప్రైవేట్ పాఠశాలల యాజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కోటపల్లి: వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కోటపల్లి సీఐ బన్సీలాల్ సూచించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం కోటపల్లి, వేమనపల్లి ఆటోడ్రైవర్లు, బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజేందర్, సురేశ్, ఏవో సాయికృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

నస్పూర్: స్కూల్ వ్యాన్లు, బస్సులు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సీసీసీ నస్పూర్ ఎస్సై ఉపేందర్‌రావు అన్నారు. సీసీసీలోని ఆక్స్‌ఫర్డ్ క్రియేటివిటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో గురువారం ప్రైవేటు పాఠశాలల వ్యాన్, బస్సు డ్రైవర్లకు ట్రాపిక్ రూల్స్, ట్రాఫిక్ చట్టంపై అవగాహన కల్పించారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



రైల్వే జీఎం సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంజిరెడ్డి, రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని హమాలివాడలో మూతపడిన రైల్వేగేట్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ సికింద్రాబాద్ రైల్ నిలయంలో రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవకు గురువారం బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి వినతిపత్రం అందించారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని, రైల్వేస్టేషన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, మంచిర్యాలలో నాగ్‌పూర్–సికింద్రాబాద్‌ల మధ్య నడిచే వందే భారత్ రైలు నిలుపుదల చేయాలని కోరారు. తిరుపతి వెళ్లే భక్తుల సౌకర్యార్థం మంచిర్యాల–తిరుపతి నూతన రైలు మంజూరు చేయాలని, చెన్నై సెంట్రల్–జోద్‌పూర్ రైలుకు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన జీఎం రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం సర్వే చేస్తామని చెప్పినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్ పాల్గొన్నారు.

పద్మశాలీ కులస్తుల మోటార్‌బైక్ ర్యాలీ



రామకృష్ణాపూర్: ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశాలీలు

రామకృష్ణాపూర్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా మోటార్‌బైక్ ర్యాలీ చేపట్టారు. చేనేత రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించి చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఉచిత కరెంటు అమలు చేయడంతో పాటు కేంద్రం జీఎస్టీ నుంచి చేనేత కార్మికులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు వనం సత్యనారాయణ, ఆడెపు తిరుపతి, వేముల వెంకటేశ్, కృష్ణకుమార్, సమ్మయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: జాతీయ చేనేత దినోత్సవాన్ని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలీ స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులకు పద్మశాలీ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, రాష్ట్ర నాయకులు అడిచర్ల సాగర్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి**

కాసిపేట/తాండూర్/దండేపల్లి/జన్నారం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలని జిల్లా ఐసీడీఎస్ పీడీ రౌఫ్‌ఖాన్ అన్నారు. జన్నారం మండలంలోని ఐసీడీఎస్ తపాలపూర్ సెక్టర్ ఆధ్వర్యంలో గురువారం చింతగూడ రైతు వేదికలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కాసిపేట మండలంలోని ముత్యంపల్లి–1 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాధిక ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి, తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. తాండూర్ మండలంలోని రేచిని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ తాండూర్ సెక్షన్ సూపర్‌వైజర్ స్వరూపారాణి తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు.

- **యువకుడికి తీవ్ర గాయాలు**

తాండూర్: మండలంలోని మాదారం–3 ఇంక్‌లైన్ సమీపంలోని సింగరేణి రోడ్డుపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పంచాయతీ బాపుగూడెంకు చెందిన ప్రశాంత్ తాండూర్ ఐబీ నుంచి ఇంటికి తన బైక్‌పై వెళ్తున్నాడు. మాదారం–3 ఇంక్‌లైన్ ఎత్తుగడ్డ ప్రాంతంలో రోడ్డుపై ఉన్న గేదెను గమనించక వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రశాంత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని 108లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. ఈ ప్రమాదంపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మాదారం ఎస్సై సౌజన్య తెలిపారు.

- **చెట్ల పొదల తొలగింపు..**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం గురువారం హాజీపూర్ పోలీసులు చెట్లు, ముళ్ల పొదల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. హాజీపూర్ మండల కేంద్రం నుంచి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట బుగ్గగట్టు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు, ముళ్ల పొదలు తొలగించారు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్, ఏఎస్సై ఎస్‌కే.చాంద్‌పాషా, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, తిరుపతి పాల్గొన్నారు.

- **‘అక్రమ అరెస్టులు ఖండించండి’**

పాతమంచిర్యాల: మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ అరెస్టును ఖండించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ అరెస్టును ఖండిస్తూ జిల్లా కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు గురువారం జిల్లా కేంద్రంలో ప్లకార్డులతో ప్రదర్శన చేశారు.

- **రెండ్రోజుల్లో పట్టదారు పాసుపుస్తకం**

జైపూర్: రైతుల భూ సమస్యల దృష్ట్యా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించి భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా చర్యలు చేపడుతోంది. మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన ఈసారపు రాజమౌళి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోగా, ఆ సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరించి గురువారం పట్టదారు పాసుపుస్తకం అందించినట్లు తహసీల్దార్ వనజారెడ్డి తెలిపారు.

- **‘అభివృద్ధిని ఓర్వలేకే.. అసత్య ప్రచారాలు’**

నెన్నెల: మండలంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వినోద్ కాంగ్రెస్ నాయకులపై పనిగట్టుకొని అసత్య ప్రచారం చేస్తున్నారని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేసి కించపర్చిన బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేష్, తోట శ్రీనివాస్, మల్లాగౌడ్, మొహిద్‌ఖాన్, సింగతి తిరుపతి, తిరుపతిరెడ్డిలు పాల్గొన్నారు.

- **ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన**

తాండూర్: బ్యాంకుల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులు అవగాహన పెంపొందించుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి సూచించారు. తాండూర్ యూనియన్ బ్యాంకు, భీమిని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. బ్యాంకు లావాదేవీలు, బ్యాంకుల ద్వారా ఖాతాదారులకు అందుతున్న సేవలు, డిజిటల్ ఖాతాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ నిశాంత్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ అశోక్, రవి, సత్యనారాయణ, సీఎస్పీలు పాల్గొన్నారు.

- **పుస్తకాలు పంపిణీ**

రామకృష్ణాపూర్: సంపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఠాగూర్ స్టేడియం వద్ద గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ ప్రవీణ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.